# పోలవరంకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి

-మంత్రులను కోరిన రామచంద్రయాదవ్

పుంగనూరు,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఏడులక్షలహెక్టార్లకు నీరందించే బృహత్తర ప్రాజెక్టు పోలవరంకు ఈబడ్జెట్‌లో నిధులు పెంచాలని పారిశ్రామికవేత్త బోడె రామచంద్రయాదవ్ ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. తొలుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి కేంద్రం పోలవరంకు అందిస్తున్న సాయం ఎంతో ప్రశంసనీయమన్నారు. చెప్పిన విధంగా ఇవ్వాల్సి న రూ.20వేల కోట్లలో ఇప్పటికే ఏడువేల కోట్లను అందించగా,ఇటీవల పెరిగిన వ్యయంతో పాటూ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయిలో నిధులు అవసరమున్నందున వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాగా ఆయన కేంద్ర రహదారుల మంత్రి షెకావత్‌ను కలిసి నంద్యాల వద్ద నిర్మించాలనుకుంటున్న ఐకానిక్‌బ్రిడ్జి వల్ల రవాణా సమస్య మాత్రమే తీరుతుందని,అలా కాకుండా బ్రిడ్జి నిర్మించి రైతులకోసం బ్యారేజ్ నిర్మాణం చేపట్టాలన్నారు. బ్యారేజి వల్ల రాయలసీమలో వేలాది మంది రైతులకు సాగు నీరుతో పాటూ ప్రజలకు తాగునీటికి ఉపయోగం ఉంటుందన్నారు.కేంద్ర అటవీశాఖా మంత్రి భూపేంద్రసిం గ్‌ను కలిసి రాష్ట్రంలో తిరుపతి శేషాచలం కొండల్లో జరుగుతున్న ఎర్రచందనం స్మగ్లింగ్‌నుఅరికట్టాలనిసూచించారు.దీనిపైరాష్ట్రప్రభుత్వంశ్రద్ధ చూపలేదని,కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. మంత్రులుతాను ఇచ్చిన నివేదికలతో పాటూ సానుకూలత వ్యక్తం చేశారని ఆయన

## మాజీ ఎంపీచే కంటి వైద్య శిబిరం ప్రారంభం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



స్థానిక ఎన్‌పిసి నాయుడు పార్కులో బుధవారం చేపట్టిన ఆరబిందో ఉచిత కంటి వైద్య శిబిరంను మాజీ ఎంపి దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వరచౌదరిలు ప్రారంభించారు. తిరుపతి నగరంలోని ఆరవిందో కంటి ఆసుపత్రి వైద్య బృందం ఈ వైద్య శిబిరంను ఏర్పాటు చేసింది. ఈ శిబిరంలో 197 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 25 మందికి ఆపరేషన్లకు గుర్తించారు. ఆపరేషన్లకు గుర్తించిన వారిని తిరుపతికి తీసుకెళ్ళి ఆసుపత్రిలో ఉచిత కంటి ఆపరేషన్లు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాసేవా సమితి అధ్యక్షుడు, న్యాయమూర్తి ఐ.కరుణకుమార్, తహసిల్దారు బెన్నురాజ్, ఉప సర్పంచ్ కమలనాథరెడ్డి, మాజీ సర్పంచ్ సురేంద్రనాయుడు, కంటి వైద్య సిబ్బంది డాక్టర్ రచన, డాక్టర్ లహరి తదితరులు పాల్గొన్నారు.

## వేళకు బస్సులు తిప్పకుంటే ఎట్లా సారూ!

కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



కుప్పం నుంచి గుడుపల్లె మార్గంలో తిరిగే బస్సులను సకాలంలో తిప్పకపోవడంతో బుధవారం విద్యార్థులు ఆర్టీసీ బస్సు ఎదుట నిరసన తెలిపారు. ఉదయం, సాయంత్రం పూట కళాశాలలు, పాఠశాలల సమ యాలకు అనువుగా బస్సులు నడపకపోవడంతో తాముతీవ్ర ఇబ్బందు లుపడుతున్నామని ఎర్కొన్నారు. ఆర్టీసీబస్సులు నిర్ణీతవేళల్లో రాకపోవడం తో తాము తరగతులు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## అట్టహాసంగా పిడిఎఫ్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు

చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు పిడిఎఫ్ అభ్యర్థులు బుధవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. కట్టమంచి చెరువు నుండి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ నాయకులు, కార్యకర్తలతో భారీ ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకొన్న పిడిఎఫ్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి.బాబురెడ్డిలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి నామినేషన్లను దాఖలు చేశారు. కట్టమంచి నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ప్రదర్శనలో రాష్ట్ర సిఐటియు ఉపాధ్యక్షుడు కందారపు మురళి, రాష్ట్ర ఎఐటియుసి ఉపాధ్యక్షుడు పి.మురళి, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రామానాయుడు, ఎస్‌టియు, యుటిఎఫ్ సంఘాల నాయకులు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

## మూగ జీవుల దప్పిక తీర్చడానికి ఏర్పాట్లు

పాలసముద్రం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



వేసవి ప్రారంభం కానుండటంతో మూగ జీవుల దప్పిక తీర్చడానికి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. పాలస ముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా వున్న తొట్టెలను బుధవారం పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నాలుగు తొట్టెలు వుండటంతో వారంకు ఒకసారి శుభ్రం చేస్తే మూగజీవుల దప్పిక తీర్చవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీరు నాగరాజు, స్వచ్ఛభారత్ కార్మికుడు నరసింహులు పాల్గొన్నారు.

## నగరి భక్తులకు పనిముట్ల వితరణ

నగరి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



నగరి పట్టణానికి చెందిన పలువురు ఓంశక్తి భక్తులు బుధవారం మేల్‌మరువత్తూరులో జరిగిన అడిగళార్ కుమారుడు శక్తి జీబీ అన్బళగన్ జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. ఈ వేడుకల్లో నగరి ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం చెందిన ఐదుగురికి సైకిల్లు, ఐదుగురికి టీ క్యాన్లు, ఐదుగురు మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురు విద్యార్థులకు అభ్యసనా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రోజా

నగరి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



మంత్రి రోజా ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతుగా మంత్రి రోజా చిత్తూరులో కలెక్టర్ కార్యాలయం వరకు బుధవారం జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి నామినేషన్ దాఖలుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని వినతిచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు కకాని గోవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, ఎంపీ గురుమర్తి, చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు,సత్యవేడు, కుప్పం ఇన్‌చార్జి భారత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రైతులు అనవసర ఖర్చులు తగ్గించుకోవాలి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



వ్యవసాయ శాఖ వారు సూచించిన మెళకువలను తెలుసుకుని రైతులు అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. బుధవారం మండల పరిదిలోని బోడిపాటివారిపల్లెలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగ కాండం తొలచు పురుగులనుంచి ఏవిధంగా పంటను కాపాడు కోవాలో వివరించారు. అదే విధంగా నీలి మరియు పసుపు రంగుజిగురు అట్టల ద్వారా రసంపీల్చు పురుగులైన తామర పురుగులు, పచ్చదోమ, తెల్లదోమ, వంటి పురుగుల ఉధృతిని నివారించుకోవడం వంటి విషయాలు తెలియజేశారు. పొలం పరిసరాలు విశ్లేషణ ద్వారా పొలంలో మిత్రపురుగులు, శత్రుపురుగులను గుర్తించి వాటితో సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాలో తెలియజేశారు.కార్యక్రమంలో ఏఈఓ ఖాదర్‌వల్లి, వివిఎమ్ వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

## ఎన్నికల పరిశీలకులు నియామకం

చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఎన్నికల పరిశీలకు రాలిగా ఐఎఎస్ అధికారి కె.సునీతను ఎలక్షన్ కమీషన్ పరిశీలకురాలిగా నియమించింది. అలాగే ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా ఐఎఎస్ అధికారి కోన శశిధర్‌ను ఎలక్షన్ కమీషన్ నియమించింది. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా ఐఎఎస్ అధికారి బి.శ్రీధర్‌ను ఎలక్షన్ కమీషన్ నియమించింది.

## చిత్తూరు తహసిల్దారుపై ఎలక్షన్ కమీషన్ వేటు

చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన చిత్తూరు తహసిల్దారు పార్వతిపై ఎలక్షన్ కమీషన్ వేటు వేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులో వున్న సమయంలో తహసిల్దారు పార్వతి కోడ్‌ను ఉల్లంఘించి రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహించినట్లు ఎలక్షన్ కమీషన్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఎలక్షన్ కమీషన్ చిత్తూరు తహసిల్దారు పార్వతిపై వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## సిఎం,పెద్దిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం

పుంగనూరు,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

రాష్ట్రంలో జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యర్థులుగా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారికి అవకాశం కల్పించడం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి,మంత్రి పెద్దిరెడ్డిల ఔన్నత్యానికి నిదర్శనమని సంఘ నాయకులు రాజు, శంకరప్ప, అశోక్, కృష్ణప్ప అమర నాథ్‌లు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం సంఘనాయకులు సిఎం,మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలపట్ల ఎంతో ఆసక్తిచూపుతున్న ముఖ్యమంత్రి ఎస్సీ ఎస్టీ మైనార్టీ బడుగు వర్గాలకు కూడా మద్దతుగా ఉంటూ ముందుకు తీసుకువెడుతున్నారన్నారు.కార్యక్రమంలో నాయకులు చిన్నా రాయుడు, మునిరత్నం, లక్ష్మీనారాయణ, బాబు, హరి, సురేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాలమహానాడు దివంగత నేత మిద్దింటి వెంకటస్వామి తృతీయవర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

## టమోటా..బంగాళాదుంప సాగులో మెళకువలు అవసరం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



టమోటా, బంగాళాదుంప పంటసాగులో రైతులు తగు మెళకువలు పాటించాలని చిత్తూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా॥ నాగమణి, డా॥ రాఘవేంద్ర చౌదరి, డా॥ శారదజయలక్ష్మిలు సూచించారు.బుధవారంపిబినత్తం,శెట్టిపల్లిలో రైతులకు ఉద్యానవన శాఖ, సీడాప్ అధ్వర్యంలో ఉద్యానవన పంటలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎడిఏ కోటేశ్వరరావు, ఉద్యానవన అధికారి డింపుప్రియ, విహెచ్‌ఎలు పాల్గొన్నారు.

## నేడు సీజ్ చేసిన వాహనాల వేలం

పెద్దపంజాణి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన రెండు కార్లు, రెండు ఆటోలు, పాలవ్యాన్, తొమ్మిది టువీలర్లను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పెద్ద పంజాణి పోలీస్ స్టేషన్‌లో బహిరంగవేలం వేయనున్నట్లు ఎస్సై స్వర్ణతేజ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రెండువేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని వాహనాలకు జిఎస్టీ ఉంటుందని పేర్కొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో పాటల చిత్రీకరణ

**- దేవదాయశాఖ నిబంధనలకు తిలోదకాలు - దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్**

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ఇటీవల శివరాత్రి సందర్భంగా ఆలయంలో గాయకురాలు మంగ్లీ ఆట, పాటను చిత్రీకరించడం, యూట్యూబ్ నందు వైరల్ కావడంతో కోట్లాదిమంది హిందూభక్తుల మనోభావాల్ని గాయపరచిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూధార్మిక క్షేత్రం, దక్షిణ కైలాసంగా పిలువబడుతున్న శ్రీకాళహస్తీశ్వర ఆలయప్రాంగణంలో సినిమా షూటింగ్లు, వీడియో చిత్రీకరణ పూర్తిగా నిషేదించడమైనదనీ, కానీ సినీ గాయకురాలు స్వామి వారి ఆలయంలోని నటరాజస్వామి విగ్రహం, కాలభైరవ స్వామి విగ్రహం, స్వామివారి ఊంజల్ సేవ మండపం తదితర ప్రాంతాల్లో నృత్యం చేయడం జరిగిందన్నారు. ఈ పాటను యూట్యూబ్‌లో చూసిన దేశవిదేశాలలో వున్న భక్తులు తీవ్ర అసంతృప్తికి లోనుకావడం జరిగిందన్నారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికిరాతపూర్వకంగాఫిర్యాదుచేయనున్నట్లుఆయనపేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పేద బ్రాహ్మణ మహిళకు ఆర్థిక చేయూత

వాకాడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



వాకాడు దళితవాడలో వెలసిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం మధ్యాహ్నం శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దర్భా శారదమ్మ అనే బ్రాహ్మణ మహిళకు ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు మాట్లాడుతూ ప్రవాస భారతీయులు మధు కిరణ్ రెడ్డి, కందనూరు సుబ్రమణ్య శర్మ, కందనూరు శేషాద్రి శర్మ, అరసి నరేష్ శర్మల సహాయ సహకారాలతో భిక్షాటనతో జీవిస్తున్న ఒంటరి బ్రాహ్మణ మహిళకు వస్త్రాలు, దుప్పట్లు, మూడు వేల రూపాయిలు నగదును అందజేసారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ సులభాదేవి, అమలాంబా సమేత పరిపూర్ణానంద స్వామి, సుబ్రమణ్యం, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ సర్వే పారదర్శకంగా ఉండాలి

కోట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఓ భవాని కోరారు. బుధవారం మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాలెంలో సర్వేను ఆమె పరిశీలించారు. వాలంటీర్లు, ఆశా వర్కర్లు ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి వివరాలు సమగ్రంగా సేకరించాలని సూచించారు. ఆమె వెంట ఎంఇఓ వెంకటసునీల్ ఉన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు తథ్యం

- తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త: వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని తిరుపతి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర కమ్యూనిటీ బోర్డ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తూర్పు రాయలసీమ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిలు భారీ మెజారిటీతో గెలుస్తారని తెలపారు. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళీ గెలుపు నల్లేటి మీద నడకేనని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో నేదురుమల్లి పాల్గొన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని తెలిపారు.

## ప్రభుత్వం సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

బాలాయపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



ప్రభుత్వం ఎన్నికల ముందు సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని యూపీఎఫ్ జిల్లా కార్యదర్శి కుమారస్వామి తెలిపారు. బాలాయపల్లి మండల యుపీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు సీఎం జగన్మోహన్‌రెడ్డి చేస్తానని ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. యుపీఎఫ్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రతి నెల 1వ తేదీ జీతాలు ఇవ్వాలని తెలిపారు. మండల యూత్ అధ్యక్షులుగా ఫిరోజ్‌ఖాన్, అధ్యక్షుడిగా చలపతి, అసోసియేషన్ అధ్యక్షులుగాగంగారాం,మాధవీలత,ప్రధానకార్యదర్శిసాయిశ్రీహరి,కోశాధికారిగారాంప్రసాద్‌లఎన్నికయ్యా రు.

## గుండెపోటుతో వీఆర్‌ఓ మృతి

ఓజిలి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

ఓజిలి మండలం పున్నేపల్లి వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న కాపులూరు యోహాను (51) గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యానికి గురై చెన్నైలోని విజయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న ఆయనకు బుధవారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో గుండెపోటు రావడంతో మృతిచెందారు. మృతదేహాన్ని నాయుడుపేట మండలం కాపులూరు గ్రామానికి తీసుకొచ్చారు. దొరవారిసత్రం మండలంలో విధుల్లో చేరి బదిలీలలో భాగంగా, ఓజిలి, చిల్లకూరు మండలాల్లో పనిచేసిన యోహాను మృతితో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## శ్మశాన వాటికకు దారి చూపండి.

-నెన్నూరు హరిజనవాడ గ్రామస్థుల వేడుకోలు

రామచంద్రాపుర ం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: శ్మశాన వాటికకు దారి చూపాలని నెన్నూరు హరిజన వాడ గ్రామస్థులు అధికారులను వేడుకుంటు న్నారు. బుధవారం గ్రామానికి చెందిన జోగి జయచంద్ర మృతి చెందాడు. ఈ నేపథ్యంలో జయచంద్ర భౌతిక కాయాన్ని శ్మశాన వాటికకు తరలించడానికి నక్కలవాగులో ప్రవహిస్తున్న మీటరు లోతు వాగులో వెళ్ళాల్సివచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో గ్రామంలో ఎవరైన మరణిస్తే వారి దహన సంస్కారాలు చేయడం గ్రామస్థుల వెతలు వర్ణణాతీతం అన్నారు. అధికారులు స్పందించి నక్కలవాగుకు వారధి నిర్మించి రోడ్డు సౌకర్యం కల్పించాలని

# 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



గూడూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : గూడూరు మండలం తీపనూరు, మేకనూరు అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వీరి నుంచి ఎర్రచందనం దుంగలు, కారు, మోటార్‌సైకిల్‌లను టాస్కోఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఐ వినోద్‌కుమార్ టీమ్ మంగళవారం రాత్రి నుంచి గూడూరు సెక్షన్ పరిధిలోని తీపనూరు-మేకనూరు రోడ్డులోని అటవీ పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. ఆ రోడ్డులో పడమర వైపు ఒక కారు, మోటార్ సైకిల్ నిలిపి ఉండటంతో వారిని సమీపిస్తుండగా పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వీరి నుంచి 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు ఏడుగురు ఉండగా, వారిని పుత్తూరు మండలం డి.సుబ్రహ్మణ్యం (60; నగరికి చెందిన ఎస్.పళణివేలు (50), ఎంజి శేఖర్ (42), గూడూరు మండలం నేలటూరుకు చెందిన గోర్ల కృష్ణయ్య (42), దేవిపాలెంకు చెందిన సిద్ధపురెడ్డి ప్రసాద్ (26), మండడి మనోహర్ (57), వరదయ్యపాలెంకు చెందిన సలవారి రవి (35)లుగా గుర్తించారు. వీరిని తిరుపతి టాస్కోఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు. ఎస్ఐ మోహన్‌నాయక్ కేసు విచారిస్తున్నారు. వినోద్‌కుమార్ టీమ్‌ను ఎస్పీ అభినందించారు.

## పర్సనాలిటీ డెవలప్మెంట్ పై అవగాహన

తిరుపతి (విద్య), ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసోసియేట్ డా. టి. చైతన్య పర్స నాలిటీడెవలప్మెంట్ అనే అంశంపై మహిళా విశ్వవిద్యాయలంలోనినర్సింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి. చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు వారి యొక్క జీవన ప్రగతి, ఉద్యోగపరంగా అభివృద్ధి చెందుటకు వారి యొక్క వైఖరి, ప్రవర్తన, వారి పై వారికి విశ్వాసం చాలా ముఖ్యమని తెలిపారు. యోగా, ధ్యానం చేయడం ద్వారా చాలా సమస్యల్ని ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించు కోవచ్చు అన్నారు. దృఢమైన మానసిక, శారీరక పరమైన ఆరోగ్యం కొరకు ఆటలాడడం, ప్రతి రోజు నడవడం, వ్యాయామం చేయడం లాంటివి చేయాలని తెలిపారు.మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ప్రాధమిక దశలో నివారణ సాధ్యమే.

ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్ధసారధి రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



క్యాన్సర్ వ్యాధిని ప్రాధమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే నివారించవచ్చని తిరుపతి ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్ధసారధి రెడ్డి అన్నారు. బుధవారం కమ్మపల్లి పిహెచ్‌సి ఆవరణలో మహిళలకు ప్యా ప్ టెస్ట్, స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాలలో ప్రజలు పరిసరాల పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి రోగాలను దూరం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మపల్లి పిహెచ్‌సి చైర్మన్ మహేంద్ర రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ హేమలత, డాక్టర్ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## మన ఊరు పుట్టిన రోజు వేడుకకు రండి

-ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పిలుపు

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



తిరుపతి పుట్టిన రోజు వేడుకకు రండి అని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ముందర ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 24వ తేది శుక్రవారం తిరుపతి నగరం పుట్టినరోజు పండుగ నిర్వహించడం జరుగుతుం దని శుక్రవారం ఉదయం 8 గంటలకు తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయం ప్రాంగణం నుండి ప్రారంభమయ్యే వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా భాగస్వామ్యం కావాలని కోరారు. 1130 ఫిబ్రవరి 24వ తేది సౌమ్యనామ సంవత్సరం పాల్గుణ పౌర్ణమి, ఉత్తరా నక్షత్రం సోమవారం నాడు భగవద్ రామానుజాచార్యులు గోవిందరాజస్వామికి ప్రతిష్టించే, నాలుగు మాడాల వీధులను ఏర్పరిచి తిరుపతి నగరానికి పునాది వేయడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, మానవ వికాస వేదిక కన్వీనర్లు సాకం నాగరాజు, శైల కుమార్, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారి, కోఆప్షన్ సభ్యులు వెంకట రెడ్డి, దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, దేవదానం, అశోక్ కుమార్ రెడ్డి, బాలిశెట్టి కిషోర్, లక్ష్మీ వెంకటేశ్వర్లు, గీత, కవిత, శాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు, ఎల్లుండి లోకేష్ పాదయాత్ర విజయవంతంపై కసరత్తు

తిరుపతి,ఫిబ్రవరి 22ప్రభాతవార్త:



యువనేత, జాతీయ కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేటి సాయంత్రం తిరుపతికి చేరుకోనుండ టంతో తెలుగుదేశం శ్రేణులు విజయవంతం చేయడంపై మల్లగుల్లాలు పడుతున్నారు. 24,25తేదీల్లో లోకేష్ తిరుపతి నగరంలోనే ఉండనున్నందున పార్టీ శ్రేణులను ఇన్‌ఛార్జిలు సుగుణమ్మ, సురేంద్రకుమార్ ,అనురాధ సమాయత్తం చేస్తున్నారు. బుధవారం తిరుపతి టిడిపి మహిళ కమిటీలతో సుగుణమ్మ సమావేశమై అనుసరించాల్సి న వ్యూహంపై నిర్దేశం చేశారు.

## వైభవంగా ముక్కోటి ఆగస్త్యేశ్వర స్వామి రథోత్సవం

-శివనామస్మరణలతో ఆదిదంపతుల ఆనంద పరవశం

చంద్రగిరి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తొండవాడ స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామి రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయ అర్చకులు ఉదయం 6 గంటలకు స్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామి వారికి విభూది అభిషేకం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి రథంపై అధిష్టింపజేశారు. 8 గంటలకు మేళతాళాలు మంగళ వాయిద్యాలతో భక్తుల శివనామస్మరణల నడుమ ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. 9 గంటలకు శ్రీ వినాయక స్వామి వారికి అభిషేకం జరిపించారు అదేవిధంగా సాయంత్రం 6 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేష అలంకరణ గావించి కామధేను వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల శివనామస్మరణల నడుమ ఆదిదంపతులు ఆనంద పరవశంతో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు

## అభివృద్ధికి ఆమడ దూరంలో ఎస్టీలు!

-జిఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలిత్యా శివశంకర్ నాయక్

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:



75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో ఇప్పటికీ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గిరిజన, యానాది, ఎరుకుల, చెంచు, బంజారా ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని 'గిరిజన నవ సమాజ్(జిఎన్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పాలిత్యా శివశంకర్ నాయక్ విచారం వ్యక్తంచేశారు.బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాయలం నందు ఐఏఎస్ ఆఫీసర్ ఆనంద్ అధ్యక్షతన ఎస్టీ జాబితాలో బిసి వర్గానికి చెందిన వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక శాతం ఎస్టీలు నివాసమున్న తాండాలు,ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేవన్నారు.జబ్బు చేస్తే ఆసుపత్రులకు వెళ్లాలన్నా కనీస రవాణా సౌకర్యం లేక వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ఎస్టీ జాబితాలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన వాల్మీకి బోయలను చేర్చడం దారుణమన్నారు.

# ఎమ్మెల్సీ సీటును నేను డబ్బిచ్చి కొనుక్కోలేదు

-దీనిపై కాణిపాకంలో ప్రమాణానికి సైతం సిద్ధం
-వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి డా॥సిపాయి



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: తాను వైసిపి తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా బి-ఫారం తీసుకోవడానికి పార్టీ అధిష్టానానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని,పైపెచ్చు తనకు మంచి భోజనం పెట్టి పంపించారని వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి డా॥సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. డబ్బులిచ్చి ఎమ్మెల్సీ సీటు కొనుకున్నానని తనపై నిన్నటి రోజున న్యూస్ ఛానెల్ డిబేట్‌లో తిరుపతికి చెందిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ఆరోపణలు చేయడంపై బుధవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన వివరణ ఇచ్చారు.వైసిపి తరపున 14 మందిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేస్తే.. అందులో 90 శాతం మంది సాధారణ,మధ్యతరగతి వారేనని అన్నారు. టిడిపిలో తాను 2014 నుండి ఉన్నా బిసిలకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని వాపోయారు.వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనారిటీ వర్గాలకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యత చూసే తాను టిడిపిని వీడి వైసిపి పార్టీలోకి రావడం జరిగిందన్నారు.బిసి నాయకుడిగా తన గ్రాఫ్ చూసే సిఎం జగన్ తనకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చారు తప్ప ఇందులో ఎలాంటి కుట్ర లేదన్నారు.

దీనిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురద చల్లడం తప్ప వాస్తవం ఏమాత్రం లేదన్నారు.ప్రతిపక్ష పార్టీలకు,భానుప్రకాష్‌రెడ్డికి నా నిజాయితీ నిరూపించుకోవడానికి ఈనెల 24వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నాన్నారు.టిడిపిలో తనను నమ్మి వచ్చిన బిసిలకు న్యాయం చేయలేకపోయి నందుకే ఇప్పుడు వైసిపిలోకి రావడం జరిగింది తప్ప వేరే ఆలోచనేదీ తనలో లేదని స్పష్టం చేశారు.

## లోకేష్ పాదయాత్రలో వైకాపా అలజడి!

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మూడు రోజులుగా సాగుతున్న తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారాలోకేష్ పాదయాత్రలో బుధవారం సాయంత్రం ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఏర్పేడు మండలంలోని కోబాక నుంచి ప్రారంభమైన పాదయాత్రలో లోకేష్ కొత్త వీరాపురం,గాండ్ల కండ్రిగ, కుక్కల వారి కండ్రిగ, కందాడు వరవ కాలువ,రాజుల కండ్రిగ, మోదుగుల పాలెం గ్రామాల్లో పర్యటించారు.ఆయన పర్యటన ఎంతో హుషారుగా సాగింది, యువకుడైన నారాలోకేష్ చక చకా నడుచుకుంటూ సాగారు.దారిలో పలువురు మహిళలతో సెల్ఫి దిగారు.అలాగే పంట పొలాల్లో పని చేసుకుంటూన్న రైతుల వద్దకు వెళ్ళి వ్యవసాయం పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓ చోట మందుబాబులతో కులాసగా మాట్లాడారు. ఇలా సాగుతున్న పర్యటనలో సాయంత్రం మరో సమావేశం తరువాత విడిదికి చేరుకోనుండగా మర్రిమంద వద్ద కొందరు ఆకతాఉలు రభస సృష్టించారు.ఓ పాఠశాల వద్ద 'లోకేష్ గోబ్యాక్ అంటూ 'ప్లకార్డులు చేతబట్టుకొని రాళ్ళు రువ్వటంతో ఉద్రికత్త చోటు చేసుకుంది. అయితే లోకేష్‌తో నడుస్తున్న యువగళం యువత ఆకతాయిల ఆటలను పసి కట్టి ఎదుర్కొన్నారు.ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అడ్డుకున్నారు.అయితే పోలీసులు చొరవ చూపి ఆకతాయిలను పాఠశాలలోనే ఉంచారు. ఆ తరువాత పాదయాత్ర సాగింది. తరువాత పాపానాయుడుపేట బహిరంగ సభలో నారాలోకేష్ భయపడేది లేదు.తగ్గేదేలే అంటూ ఛాలెంజ్‌లు విసిరారు. పోలీసుల చర్యలను ఖండించారు. తమపై లేని పోని కేసులు పెడుతున్న పోలీసులు మా పై రాళ్ళతో కత్తులతో దాడులు చేయటానికి ఉన్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు.

## కన్నులపండువగా గ్రామోత్సవం

తొట్టంబేడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన గిరిప్రదక్షిణ పల్లకీల్లో బయలుదేరిన స్వామిఅమ్మవార్లు బోయిలు మోసుకుంటూ ఎన్‌టిఆర్‌నగర్, రామచంద్రాపురం, శివనాథపురం, కొత్తకండ్రిగ, చిట్టత్తూరు గ్రామాలమీదుగా రామాపురం రిజర్వాయర్ వద్ద ఉన్న అంజూరు మండపంకు చేరుకుంటుంది. అయితే ఈఏడాది కొత్తగా రోడ్డునిర్మించడంతో కైలాసగిరి కాలనీ నుంచి ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది.గిరిప్రదక్షిణ కార్యక్రమానికి అశేషసంఖ్యలో భక్తులు హాజరవడం గమనించదగ్గ విషయం. అంజూరు మండపం వద్ద భక్తులకు స్నానఘట్టాలుతో పాటు అన్నదానం నిర్వహించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు టిడిపిదే : షణ్ముగరెడ్డి

పుత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :



చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు తెలుగుదేశం పార్టీదేనని ఆ పార్టీ చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు చెక్కుడుకుప్పం షణ్ముగరెడ్డి అన్నారు. బుధవారం టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా కంచర్ల శ్రీకాంత్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ పాలన పట్ల జనం విసుగు చెందారన్నారు. జిల్లాలో జరుగుతున్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు వస్తున్న విశేష స్పందనే దీనికి నిదర్శనంగా కనిపిస్తోందని తెలిపారు. సాధారణ ఎన్నికలు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జరిగే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయఢంకా మోగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ మేయర్ కటారి హేమలత, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

## బలిజ భవన్ సేవలో నగర పాలక సంస్థ సిబ్బంది

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :



తిరుపతి బాలాజీ కాలనీలోని బలిజ భవన్ పనులకు నగర పాలక సంస్థ వాహనాలు, సిబ్బందిని వినియోగిస్తుండడంతో పలు విమర్శలకు తావిస్తోంది. నగరంలో పలు చోట్ల చెత్త కుప్పలు దర్శనమిస్తున్న పట్టించుకోని అధికారులు బలిజ భవన్ వద్ద పనులు చేయడానికి మాత్రం నగర శుభ్రతకు వినియోగించే ట్రిప్పర్లు, ప్రొక్లైనర్లు, సిబ్బందిని పంపడం ఎంత వరకు సమంజసమని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందే..

ఫోటో రైటప్

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీకాళహస్తి పట్టణం స్వర్ణముఖినదీతీరాన ఏర్పాటుచేసిన ధూర్జటి కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈనేపథ్యంలో పట్టణానికి చెందిన యం.శరణ్య, దేవాన్షితల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామనగర్ కాలనీకి చెందిన ప్రభాకర్ కుమార్తె ఎం.మోనీషా భరతవేదమున అన్న పాటకు చక్కగా నృత్యప్రదర్శన చేయడం గమనించదగ్గ విషయం. ఇక చెన్నైకుచెందిన సునంద, వినోదిని భక్తిరంజని, శ్రీకాళహస్తివారి బాలక్రిష్ణ భక్తిరంజని, డాక్టర్ చింతారవిబాలకృష్ణ, శ్రీసిద్దేంద్ర కళాపీఠం వారిచే కూచిపూడి ప్రదర్శన, సతీష్‌పత్రి మృదంగలయ విన్యాసం, యస్‌సియస్ కళాక్షేత్రం వారి గిరిజాకళ్యాణం, కృష్ణవేణి నృత్యప్రదర్శన, శీతలాంబ నాట్యమండలి అక్కుపల్లి సుబ్బరామయ్య ఆధ్వర్యంలో పెద్దకనపర్తి వారిచే శ్రీకృష్ణ రాయబారంలోని పతాక సన్నివేశాలు, దక్షిణమూర్తి నాట్యమండలి వారి యస్.రోశయ్య సత్యహరిశ్చంద్ర నాటకంలు అలరించాయి.

## బిజెపి నాయకలు టిడిపిలో చేరిక



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

పట్టణానికి చెందిన భారతీయ జనతాపార్టీ నాయకులు తెలుగుదేశంపార్టీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సమక్షంలో శ్రీకాళహస్తీశ్వరస్వామిదేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కోనేటి సిద్దులయ్య, మరియు మైనార్టీ నాయకుడు షేక్ రియాజ్‌లకు తెలుగుదేశంపార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీకోసం కష్టపడి పనిచేయాలని నారాలోకేష్ వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## బేరివారిమండపం వద్ద 'నాగవల్లి'

ప్రభాతవార్త-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తీశ్వరాయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒకటీ ప్రత్యేకతే. సంప్రదాయాలు, సంస్కృతికి తార్కాణమే. వివాహ వ్యవస్థకు సంబంధించి పూస గుచ్చినట్లు భావి తరాలకు మార్గదర్శకంగా నిర్వహిస్తున్నారు. కళ్యాణోత్సవం రోజు వివాహ వ్యవస్థను యువతకు మార్గదర్శకం కాగా గిరి ప్రదక్షిణలో బేరివారి మండపం వద్ద 'నాగవల్లి కార్యక్రమం 'గమనించదగ్గది. వివాహం అయిన మూరో రోజు 'పుట్టింటి నుంచి నల్లపూసల్ని'అందించే సంప్రదాయం ఉంది. ఈ మేరకు బుధవారం స్వామి అమ్మవార్లు గిరిప్రదిక్షిణకు వెళ్ళు సమయంలో బేరివారి మండపం వద్ద ఆపి నాగవల్లి నిర్వహించారు. స్వామి అమ్మవార్లతో పాటు ఉభయదారులు బియ్యపు కృష్ణారెడ్డి, శాసనసభ్యుడు మధుసూదనరెడ్డి,ఆకర్షరెడ్డి, పవిత్రారెడ్డిలు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా మారింది. బేరివారి మండపం వద్ద సాంప్రదాయంమేరకు నిలపిఉత్సవం నిర్వహించారు. ఇక్కడ ఆలయ ఉపప్రధానార్చకులు సంబంధం గురుకుల్ సంఘం వారు అందించిన నల్లపూసల్ని అందించగా మరో ఉపప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ అమ్మవారి మెడలో ధరింపజేశారు.ఉభయదారులకు స్వామిఅ మ్మవార్ల తీర్థ ప్రసాదాల్ని అందించారు.ఈ కార్యక్రమాల్లో ఇఒ వికె సాగర్‌బాబు, దర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి: ఫిబ్రవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవకు ఇటీవల కాలంలో విదేశీ భక్తులు అధికంగా వస్తున్నారు. టూరిజంశాఖ చొరవతో ఇక్కడి ఆలయానికి విదేశీ భక్తుల తాకిడి పెరుగుతుంది. బుధవారం అమెరికా,రష్యా,జర్మని,యుక్రేన్‌కు చెందిన 35 మంది భక్తులు ఇక్కడకు వచ్చారు. వారు రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు.వారికి వెంటనే శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పూజలు చేయింటానికి చొరవ చూపారు.వారు రూ.500లు రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోగా వారికి ఆలయంలో నిర్వహించే గిరి ప్రదక్షిణ గురించి ఎంఎల్‌ఏ వివరించారు. వారు స్వామి అమ్మవార్లను దర్శించుకున్న తరువాత వారితో కలసి ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూజదనరెడ్డి, చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. విదేశీ భక్తులు కొంత దూరం గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీ వరసిద్ధి వినాయకస్వామి మహా కుంభాభిషేకం

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపాలిటీ 11వ వార్డు విద్యానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం మహా కుంభాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో పరివార దేవతలైన దక్షిణామూర్తి మహా విష్ణువు దుర్గాదేవి విగ్రహాలను కూడా ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీటీఆర్‌రూరల్2: ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కలశ స్థాపన

## సంఘ నుంచి యూనియన్ లోకి



రేణిగుంట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

రేణిగుంట సీఆర్‌ఎస్‌లో బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌లోకి సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లా యిస్ సంఘ్ నాయకులు, మహిళలు చేరారు. యూనియన్ సిద్ధాంతాలకు ఆకర్షితులై యూనియన్‌లో చేరిన వీరికి సీఆర్‌ఎస్ మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, బాబు ఆహ్వానిస్తూ వీరంతా యూనియన్‌లోచేరడంతో యూనియన్ మరింత పడిందన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. యూనియన్ తీర్థం పుచ్చుకున్న వారిని సత్కరించి స్వాగతం పలికిన వారిలోసురేందర్‌రెడ్డి, బాబు,సదాశివరెడ్డి, మునిరాధయ్య, చంద్రశేఖర్, ఉదయ్‌రాయ్, హేడ్రిపాల్, చంద్రనాయక్, మణిమారన్, మునికుమార్, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌కు వైద్య పరికరాలు



రేణిగుంట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ పంచాయతీ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌కఉ బుధవారం రాయలచెరువు పార్థకిరణ్ చారిటబుల్ ట్రస్టు అధినేత ఆర్.డి.సుబ్రహ్మణ్యంరెడ్డి సమకూర్చిన వైద్య పరికరాలను సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో ప్రతి సచివాలయానికి అనుబంధంగా హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేయాలన్న ఆదేశాల్లో భాగంగా విప్పమానుపట్టెడ సచివాలయంలోనే హెల్త్ క్లినిక్ నిర్వహిస్తున్నామని వేమాపురం సంజీవరెడ్డి వెల్ఫేర్ సొసైటీ అధినేత, విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి తెలిపారు. హెల్త్ క్లినిక్ సిబ్బందికి బీపీ ఆపరేటర్, వెయిట్ మిషన్, గ్లూకో మీటర్, థర్మా మీటర్, పల్స్ ఆక్సి మీటర్ తదితర అత్యవసర వైద్య పరికరాలను అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అద్దె భవనంలో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ద్వారా ప్రారంభోత్సవం జరిపిస్తామన్నారు. నిధులు సమకూరిన వెంటనే నూతన భవనాన్ని కూడా నిర్మిస్తామన్నారు.

## ఈ నెల 24న పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్వ్యూలు

తిరుపతి (క్రీడ), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :

శ్రీ సిటీలోని స్కిల్ కాలేజీలో డిప్లమా లేదా ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులకు ఐదు నెలల పాటు ఉచిత వసతితో కూడిన అత్యున్నత ఉచిత శిక్షణ, మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాల కొరకు తిరుపతిలోని ఎస్‌వి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 24వ తేది శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శామ్ మోహన్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9032697478ను సంప్రదించాలన్నారు.

## ఆలయ నిర్మాణానికి మంత్రి రోజా ఆర్థిక సాయం



విజయపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

మండలంలోని ఆలపాకం కండ్రిగ గ్రామ దేవత పడవేటమ్మాళ్ ఆలయ నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఆర్థిక సాయం అందించారు. బుధవారం నగరిలోని తన క్యాంప్ కార్యాలయంలో తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 50,000 వేలు ఆలయ నిర్మాణ కర్తలకు ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల విజయపురం మండలంలో పర్యటించినపుడు మంత్రి ఆలయ నిర్మాణానికి సాయం చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. కార్యక్రమంలో ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు ఉచిత శిక్షణ

విజయపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :

మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద వున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో (ఐటిఐ) ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ పార్ట్ టర్మ్ కోర్సునకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపల్ గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9441647174, 9885320544, 8978278128 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## విద్యార్థులు చేడు అలవాట్లకు దూరంగా ఉండాలి

-మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:

విద్యార్థులు చేడు అలవాట్లకు లోనై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అడిషనల్ ఎస్పీ ఏ. రాజేంద్ర సూచించారు. తిరుపతి అర్బన్ పరిధిలో గేట్ కళాశాల, డిగ్రీ, పి.జి కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాలు దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు వినియోగం వల్ల జీవితాలు నాశనమై తాయని తెలిపారు. విద్యార్థులు చేడు వ్యసనాలకు లోనైన తల్లిదండ్రులను శోకసముద్రంలోకి నెట్టరాదని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ దిశగా విద్యాను అభ్యసించాల న్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించడమే కాకుండా మాదక ద్రవ్యాలు విక్రయించడం కూడా నేరమని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ సి.నాగరాజారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రమేష్,, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I,**SHAIK SAMEERA BANU** w/o P.Mahaboob Khan (Old name) R/o at D.No.2-232 Krishna Nagar, T.Sundupalli, Annamaya Dist, A.P. Have changed my name as **PATAN SAMEERA KHANAM** W/o PATAN MAHABOOB KHAN (New Name)

# పండించే పంటకు గిట్టుబాటు ధర లేదు!

## రైతులతో నారాలోకేష్ ముఖాముఖి

(ప్రభాతవార్త: శ్రీకాళహస్తి,శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు)



రేయింబవళ్ళు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరల్లేదు. ఎరువుల ధరలు ఆకాశానికి ఎక్కాయి. వ్యవసాయ ఉత్పత్తులపై కూడా జీఎస్‌టి విధిస్తున్నారు. ఇలా అయితే ఎలా బతకాలి అంటూ బుధవారం ఏర్పేడు మండలం మడిబాక గ్రామంలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పలువురు రైతులు తమ సమస్యలను తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారాలోకేష్ పాదయాత్రలో మొరబెట్టుకున్నారు. ఇక్కడ జరిగిన రైతులతో ముఖాముఖిలో రైతులు మాట్లాడితన తీరు వారి మాటల్లోనే

రైతుల ఉత్పత్తులపై జీఎస్‌టి విధిస్తున్నారు: మునిశేఖర్ నాయుడు

సమావేశంలో మడిబాకకు చెందిన రైతు మునిశేఖర్‌నాయుడు మాట్లాడుతూ కేంద్రం మద్దతు ధర అందిస్తుంది. ఎంత అందిస్తుందో రాష్ట్ర ప్రభుత్వం మాకు ఎంత ఇస్తుందో తెలియటం లేదని వివరించారు.పంట వేసే సమయానికి దళారి ఒక ధర కొనుగోలు చేసే సమయంలో మరో ధరలతో రైతులను దోపిడి చేస్తున్నారు.ఎరువుల పై జీఎస్‌టి విధించి రైతులను నిలువు దోపిడి చేస్తున్నారు. తాము పండించే పంటలకు ఖర్చులు తగ్గాలి. మద్దతు ధర ప్రకటించాలి

నారా:జగన్ పాదయాత్రలో రైతుల సంక్షేమానికి నిధిగా రూ.3500 కోట్లు కేటాయిస్తామన్నాడు. ఒక్క పంటకైనా మద్దతు ధర ఇచ్చారా? అని ప్రశ్నించారు. రైతుల బాధలను పట్టించుకునే దిశగా ప్రభుత్వం లేదు.అందుకే రైతుల ఆత్మహత్యల్లో మనం దేశంలో 3వ స్థానంలో ఉన్నాము.అభివృద్ధిలో అధస్థానంలో ఉన్నాము.రైతుల గురించి పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదు. మేము వస్తే తప్పక వ్యవసాయోత్పత్తులపై జీఎస్‌టిలను తొలగిస్తాం.భూసార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ పంటలకు ఏ భూములు అనుకూలమో రైతులకు మార్గదర్శకులౌతాము. రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా తీర్చి దిద్దుతాము.

**ఎరువుల ధరలతో దడ పుడుతుంది: భాస్కర్‌రెడ్డి**

రేణిగుంట మండలానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని జరగాలన్నారు.అక్కడ సమాధానం చెప్పె దిక్కులేదు. ఎన్నికల ముందు పాదయాత్రలో రూ.13వేలు ఏటా అందిస్తామన్నారు.కానీ రూ.7500 ఇచ్చి చేతులు దులుపుకుం టున్నారు. ఇక పోటాష్ ధర నాలుగేళ్ళ క్రితం రూ.350లుంటే నేడు 1800కు పెరిగింది కాంప్లేక్స్ ధరలు రూ.900 నుంచి 1400లకు పెరిగింది రైతులకు ఇచ్చినట్లే ఇచ్చి దోచుకుంటున్నారు రైతే రాజు అంటారు కానీ రైతే బిక్షగాడుగామారాడని వివరించారు.

**నారాలోకేష్:** ్రైతులకు గిట్టుబాటుధరలు కల్పించే పరిస్థితి లేదు. గంజాయికి అయితే ఆదరిస్తారు. కష్టపడే రైతు శ్రమను గుర్తించటం లేదు. స్కీమ్‌లు స్కామ్‌లుగా పరిపాలన సాగుతుంది. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నపుడు రైతుల బాధలను గుర్తించి రూ.50వేల లోపల రుణాలున్న రైతుల అప్పులను మాఫీ చేసామని రైతుల పట్ల చంద్రబాబుకు గల గుర్తింపు నిదర్శనం.తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇన్‌పుట్స్, విత్తనాలు, మేలురకం ఎరువులను అందించుటకు ప్రణాళిక రూపొందిస్తాం.శ్రీకాళహస్తి రైతులకు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తాం.రైతు భరోసా కేంద్రాలకు రంగులు పూసుకోవటంలో ఉన్న శ్రద్ద రైతుల బాధలను గుర్తించటంలేదు.ఆయన అధికారం చేపట్టిన తరువాత క్రాప్ హాలిడేలు ఎక్కువయ్యాయి.ఆయనకు హాలిడే ఇచ్చే రోజు త్వరలోనే ఉంది.

**చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించండి:రంగయ్యానాయుడు**

చక్కెర ఫ్యాక్టరీలను మూత వేసి చెరుకు పండించే రైతుల కడుపులు కొట్టారు. పంట మార్పిడికి రైతులు సిద్దమే కానీ ప్రభుత్వాల నుంచి ప్రోత్సహం లేదు. రైతులను ఆదుకునే దిక్కులేక పోయింది. మీరు వస్తే తెరిపిస్తారా?

**నారాలోకేష్:** తప్పకుండా రైతులను ఆదుకునేదిశగానే అడుగులేస్తాం. ప్రస్తుతం కొత్తగా ప్రభుత్వం వ్యవసాయమోటార్లకు మీటర్లు తగిలిస్తామంటున్నారు.ఇది జరిగితే రైతులకు ఉరి తాడు బిగించినట్లే ఇక వ్యవసాయమే ఉండదు.ఎక్కడ అయితే మీటర్లు బిగిస్తారో రైతులు తిరగబడండి మీ హక్కులను కాపాడుకునేందుకు ముందడుగు వేయండి మీకు తోడుగా తెలుగుదేశం ఉంటుంది.ఒక్కొక్క రైతుకు నాలుగు మోటార్లు ఉంటాయి. వాటికి మీటర్లు బిగిస్తే ఇక చార్జీలు భూములు అమ్మి కట్టాల్సిందే రైతు పరిస్థితి గోవిందా.

రైతును ఆదుకోకుంటే భవిష్యత్తులో రైతే ఉండదు: రవీంద్రనాథ్‌రెడ్డి

శ్రీకాళహస్తి మండలం ఎంపేడుకు సంబంధించిన మాజీ సింగిల్‌విండో చైర్మెన్ తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రైతులకు సంబంధించిన వాతావరణం గమనిస్తే రాబోవు పదేళ్ళ తరువాత రైతు అనే పదమే వినబడదు.రైతులకు గిట్టుబాటుధరల్లేదు. నష్టపరిహారా ల్లేదు. పంటవేసే టప్పుడు ఒక ధర. చివరికి వచ్చే సరికి కారు చౌక సొమ్ములు 3నెలలకు కాని చెల్లించరు. మిల్లర్లు దళారులు మిలాఖతై రైతులను దోచుకుంటున్నారు. స్పష్టమైనవిధానాలురావాలి.ఒకేధర ఉండాలి.

**నారాలోకేష్:** రైతులను కాపాడుకోవటానికే చంద్రబాబునాయుడు ప్రభుత్వం పని చేస్తుంది. గతంలో ఎన్నో సంక్షేమ పథకాలు అందించాము. సాగునీరంది స్తాము. సోమశిల స్వర్ణముఖిని ఏడాదిలో పూర్తి చేస్తాం.రైతులకుసాగునీరుఅందిస్తాము.అంతేకాక ధరలను స్థిరీకరిస్తాం.

***మయూర షుగర్స్‌ను తెరిపించండి: మల్లికార్జున్ నాయుడు***

ఏర్పేడు మండలం మడిబాకకు చెందిన మల్లికార్జున్ నాయుడు అనే రైతు మాట్లాడుతూ శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాలకు సంబందించి మయూర షుగర్స్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది.అలాంటి ఫ్యాక్టరీలో రైతులకు సంబంధించిన బకాయిలు చెల్లించుటకు అవకాశం ఉన్నా సరుకులున్నా ప్రభుత్వం రాజకీయంగా వ్యవహారించి జప్తులు చేసి రైతులకు చెల్లించాల్సిన సొమ్ముల్లో కొంత చెల్లించారని వివరించారు.

నారాలోకేష్: చెరకు రైతులను ఆదుకొనుటకు నిర్థిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుంటాము.చక్కెర ఫ్యాక్టరీలకు మనుగుడ కల్పిస్తాము. గతంలో కూడా చక్కెర ఫ్యాక్టరీల మనుగడకు, రైతు సంక్షేమానిక మా ప్రభుత్వం ఆదుకుంది. రాబోవు రోజుల్లో తప్పకుండా ఆదుకుంటాము.

రైతులకు సూచనలిచ్చే దిక్కేలేదు: శివశంకర్‌రెడ్డి

ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామానికి చెందిన రైతు శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు దిశ దెశ నిర్దేశం ఇచ్చే దిక్కులేదన్నారు. దాంతో పంటలపై పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాల్లేదు. లాభాల్లో ఉన్న ఎపిసీడ్స్ నేడు అప్పుల పాలైంది. చెల్లింపులు చేయలేని దుస్థితి చోటు చేసుకుంది.

నారాలోకేష్: రైతులు ఏ పంటలు పండించాలి? ఎలా పెట్టుబడులు తగ్గించు కోవాలి అనే సూచనలివ్వటానికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాము.పాస్ బుక్‌ల మీద ఫోటోలకు కాలం చెల్లింది. రైతులు మౌనం వహిస్తే ఆ భూములు కూడా జగన్‌రెడ్డివే అంటారు తస్మాత్ జాగ్రత్త అని లోకేష్ చమత్కరించారు. రైతులకు అవసరమైన సూచనల్విటానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తాము. ఈ సమావేశంలో బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు రంగినేని చెంచయ్య నాయుడు గాలి చలపతి నాయుడు, విజయకుమార్‌నాయుడు, ప్రకాష్ నాయుడు, సత్రవాడ ప్రవీణ్‌కుమార్, నరసింహాయాదవ్, నెలవల సుబ్రమణ్యం,తిక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ముఖ ఆధారిత నమోదు వందశాతం ఉండాలి

-ముఖ ఆధారిత నమోదును సంబంధిత శాఖల డిడిఓలు పర్యవేక్షించాలి

-కలెక్టర్ వెంకట రమణారెడ్డి

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**

ఉద్యోగుల ముఖ ఆధారిత నమోదు వంద శాతం తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరు అమలులో భాగంగా ఎఫ్.ఆర్.ఎస్. యాప్‌లో నమోదు కాకుండా ఇంకనూ మిగిలి వున్న ఉద్యోగులు అందరూ సత్వరమే ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నమోదు చేసుకునేలా సంబంధిత డి డి ఓలు తగు చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం తాడేపల్లి నుండి కార్యదర్శి ముత్యాలరాజు సిఎఫ్ఎంఎస్ అధికారి సునీల్‌రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ ఆధారిత హాజరుపై వర్చువల్ విధానంలో సమీక్షించగా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జె.సి.డికె. బాలాజీ, డిఆర్వో శ్రీనివాసరావు సంబంధిత జిల్లా అధికారులతో హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ చాలా శాఖలు యాప్‌లో ఇప్పటికే నమోదు పూర్తి చేసారని, ఎక్కువ సిబ్బంది ఉన్న శాఖలు జిల్లా పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మునిసిఫల్ శాఖ, అటవీశాఖ, వెటర్నరీ యూనివర్శిటీ, రెవెన్యూ తదితర శాఖలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయాలని సూచించారు. ముఖ ఆధారిత హాజరు యాప్ నందు నమోదు, హాజరు 80శాతం శాఖలలో పూర్తయిందని, దానిని వందశాతం తప్పక అమలు చేయాలన్నారు. క్యాంప్‌లో వెళ్ళిన అధికారులు, అన్‌డ్యూటీలో ఇతర ప్రాంతంలో ఉన్న అధికారులు యాప్‌లో ఉన్న నియమాల మేరకు తప్పక హాజరు వేయాలని సూచించారు. ఏదైన సాంకేతిక సమస్యలు, సందేహాలు ఉంటే ఎన్.ఐ.సిని సంప్రదించాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు డిఆర్‌డిఎ పిడి జ్యోతి, డిఎల్‌డిఓ సుశీలాదేవి, డిపిఓ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ అధికారి శంకర్ నారాయణ, పథక సంచాలకులు డ్వామా శ్రీనివాస ప్రసాద్, ఎస్ఎఆర్ డబ్లుఎస్ విజయకుమార్, జిల్లా సహకార అధికారి ఉమాదేవి, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లర్ల అసోసియేషన్‌కి మాఫియా డాన్ జగన్‌రెడ్డి : బొజ్జల

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో ఉన్న రైస్‌మిల్లర్ల అసోసియేషన్‌కి మాఫియా డాన్ కేరాఫ్ జగన్‌మోహన్‌రెడ్డి అని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. 24వరోజు నియోజకవర్గంలో నారా లోకేష్ పాదయాత్ర ఏర్పేడు మండలం కోబాక నుంచి ప్రారంభమైంది. ఇక్కడ నుంచి పాదయాత్రగా వెళుతూ ప్రజల్లోకి వెళ్ళి వారి సమస్యలను తెలుసుకున్నారు. దారిలో వరిధాన్యం రోడ్డుపైనే ఆరబోసిన అన్నదాతలతో నారాలోకేష్ చర్చించారు. దారిలో ఉన్న ఓమద్యం దుకాణం వద్ద చూసి నారాలోకేష్ సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం సదాశివపురం క్రాస్ వద్ద ఇటీవల మృతిచెందిన నందమూరి తారకరత్నకు నివాళులు అర్పించారు. అనంతరం మడిబాక గ్రామంలో రైతులతో సుమారు గంటన్నరకు పైగా చర్చించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్నదాతలకు నిలయంగా మారిందని, రైస్ మిల్లర్ల అసోసియేషన్ వారిలో జగన్‌రెడ్డి కుమ్మక్కై అన్నదాతలకు గిట్టుబాటు ధరలేకుండా చేస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితి చోటుచేసుకుందన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో అన్నదాతలకు కావాల్సిన పురుగుమదులు, విత్తనాలు, ఇతర సామగ్రిలు సబ్సిడీలోఇచ్చేవారని, నేడు ఇవన్నీ గోవిందా.. గోవిందా..అని దుయ్యబట్టారు. తొట్టంబేడు మండలంలోని రైతు మురళీరెడ్డి ఒక్క వరి, వేరుశనగ పంటలేకాకుండా డ్రాగన్‌ఫ్రూట్, బ్యాంకాక్ జామ పండ్లు పండిస్తారన్నారు. శ్రీకాళహస్తిలో తెలుగుగంగ కాలువతో వేలాది ఎకరాలుకు సాగునీరు అందగా, సోమశిల-స్వర్ణముఖి కాలువ మాత్రం అటవీప్రాంతంలో ఉండగా వెనుకబడిందని తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే క్లియరెన్స్ ఇచ్చి పూర్తిచేయాలని నారాలోకేష్‌ను కోరారు.సమావేశంలో పలు ప్రాంతాలరైతులతోపాటు, తిరుపతి పార్లమెంటు రైతు అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, మాజీ మంత్రి పరసారత్నం, యువనాయకుడు సత్రవాడ ప్రవీణ్, రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు,పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, తిరుపతి పార్లమెంటు తెదేపా మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, ధనంజయులు నాయుడు, రవీంద్రారెడ్డి, మల్లికార్జున్‌నాయుడు,పలువురు అన్నదాతలు పాల్గొన్నారు. నారాలోకేష్‌ను చూసేందుకు పెద్దఎత్తున మహిళలు, యువతీయువకులు రావడంతో వారితోసెల్ఫీదిగారు.

## బోయ, వాల్మీకి కులాలను షెడ్యూల్డ్ జాబితాలోకి!

-ఏకసభ్య కమీషన్ అధ్యయనం

-నిర్భయంగా అభిప్రాయాలు తెలియజేయాలి శామ్యూల్ ఆనంద కుమార్

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**




బోయ, వాల్మీకి కులాలను షెడ్యూల్డ్ తరగతుల జాబితాలో చేర్చుటకు అధ్యయనం చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమీషన్ ఏర్పాటు చేసిందని రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. శామ్యూల్ ఆనంద్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏక సభ్య కమిషన్ సమావేశం శామ్యూల్ ఆనంద్ కుమార్ అధ్యతన నిర్వహించారు. ఈ సమావేశంలో శామ్యూల్ ఆనంద కుమార్ మాట్లాడుతూ విమర్శలకు తావు లేకుండా తమ వాదనలను వినిపించాలని కోరారు. తమ అభిప్రాయాలను, వినతులను స్వీకరించి, అధ్యయనం చేయటానికి ఏకసభ్య కమిషన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వివిధ కుల సంఘ నాయకుల నుండి అభిప్రాయాలను సావధానంగా విని రికార్డు చేసుకుని, వినతులను స్వీకరించారు. ఎస్టీ సంఘ సభ్యులు, నాయకులు వివరిస్తూ ఇతర కులాలను జాబితాలోకి చేరిస్తే మా కులానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రస్తుతం వున్న ఎస్టీ రిజర్వేసన్ల సంఖ్య శాతాన్ని పెంచాలని సూచించారు మాట్లాడుతూ జరుగుతుందన్నారు. బోయ, వాల్మీకి సంఘ సభ్యులు, నాయకులు వివరిస్తూ రాష్ట్రంలో 8జిల్లాలలో ఎస్టీలుగా పరిగణింప బతున్నామని, రాయలసీమ జిల్లాలో బి.సి-ఏ లుగా పరిగణిస్తున్నారని, ఒకే రాష్ట్రంలో ఒకే కులానికి రెండు విధాలుగా అమలు చేయడం సరికాదని, న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. ఎస్.సి. సాధికార సంస్థ అధికారి, గిరిజన సంక్షేమ అధికారి చెన్నయ్య, ఎస్టీ జాబితాలో చేర్చాలని, గతంలో వున్న విధంగా పునరుద్దరించాలని బోయ సంఘ నాయకులు నాగరాజు, పాపయ్య, బాలయ్య, వెంకటరమణ, అమరనాథ్, విశ్వనాథం, రమణ, కిశోర్, కృష్ణ కోరారు. ఎస్టీ సంఘాల సభ్యులు, నాయకులు ఇప్పటికే మేము అభివృద్దికి నోచుకోలేదని మరి కొన్ని కులాలను చేరిస్తే అన్యాయం జరుగుతుందని వాపోయారు. రిజర్వేషన్ శాతం పెంచిఇ, ఆపై చేర్చాలని గుండాల నాయక్, కళావతి, మల్లేష్ నాయక్, అక్కులప్ప నాయక్, వెంకటరమణ తదితరులు తమ అభిప్రాయాలను ఏకసభ్య కమిషన్‌కు వివరించారు. అనంతరం శామ్యూల్ ఆనంద్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

## పన్ను బకాయిలు సకాలంలో వసూలు చేయండి : కమిషనర్

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :**



నగర పాలక సంస్థ పరిధిలో వసూలు చేయవల్సిన ఇంటి పన్నులు, నీటి చార్జీలు, భూగర్భ మురుగునీటి చార్జీలు, అన్ని రకాల పన్నులను సకాలంలో వసూలు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి రెవెన్యూ అధికారులను, ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. పన్నుల వసూళ్లపై బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో, సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పన్నుల బకాయిలు ఎక్కువగా ఉంటున్నాయని ఆ బకాయిలు సకాలంలో వసూలు చేయాలన్నారు. అలాగే నీటి పన్ను బకాయిలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. రెవెన్యూ సిబ్బందితోపాటు ఇంజినీరింగ్ అధికారులు, అమెనిటీ సెక్రెటరీలు సమన్వయ పరుచుకుని బకాయిలు వసూలు చేయాలి ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధిక మొత్తంలో నీటి చార్జీలు బకాయిలు ఉన్నవారి కనెక్షన్లు తొలగించాల్సిందిగా సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్‌ను ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి సచివాలయాల పరిధిలో అడ్మిన్ సెక్రటరీ, ఆమెనిటీ సెక్రెటరీ, వెల్ఫేర్ సెక్రెటరీ, మహిళా సంరక్షణ కార్యదర్శులు వాలంటీర్లతో కలిసి పన్నులు వసూలు కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్ళలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కూడా ఎప్పటికప్పుడు మెరుగైన రీతిలో అందించడం జరుగుతున్నదని ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, ప్రకాష్, సూరిబాబు, మధుసూధన్ రెడ్డి, నవీన్ కుమార్, శంకరయ్య, జ్యోతి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రెవెన్యూ సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్ళకు రుణ ప్రక్రియ వేగవంతం : కమీషనర్

**చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**




టిడ్కో ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి లబ్దిదారులకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ బ్యాంకర్లను కోరారు. నగర పాలక సంస్థ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను కమీషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం బ్యాంకర్లను తీసుకెళ్ళి చూపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు, మధ్యతరగతి ప్రజల సొంత ఇంటి కల సకారం చేయడానికి టిడ్కో ఇళ్ళను నిర్మిస్తోందన్నారు. ఇందులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళకు సంబంధించి రుణాల మంజూరు ప్రక్రియను బ్యాంకులు వేగవంతం చేయాలన్నారు. 365, 430 చదరపు అడుగుల ఇళ్ళకు ఇప్పటికే బ్యాంకులు 75 శాతం రుణాలు మంజూరు చేశాయన్నారు. మిగిలిన 25 శాతం రుణాలను సైతం మార్చి నెలాఖరులోపు మంజూరు చేయడానికి బ్యాంకులు చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్ పనులు, మౌళిక వసతులు పూర్తి కావడంతో ఈ దశలో లబ్దిదారులకు రుణం అందిస్తే పనులు మరింత వేగంగా పూర్తి అవుతాయన్నారు. ఈ సమావేశంలో మెప్మా పిడి రాధమ్మ, ఎల్‌డిఎం శేషగిరిరావు, టిడ్కో ఇఇ వెంకటముని, ఎసిపి

## తొండమాన్‌పురంలో సింహ వాహనంలో స్వామి దర్శనం

**శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**



తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయంగా మండలంలోని తొండమనాడులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించి స్నప్న తిరుమంజనం సేవను నిర్వహించడంతో పాటు సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ఊంజల్‌సేవను నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో వెంకటేశ్వరస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పలువురు స్వామిఅమ్మవార్లకు హరతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం హనుమంత వాహనం ఉంటుందని ఆలయ ప్రధానార్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఓ పార్థసారధి, జూనియర్ అసిస్టెంట్ రవిల పర్యవేక్షణ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అశ్వవాహనంపై ఊరేగిన మొగిలీశ్వరుడు

**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అశ్వవాహనంపై మొగిలీశ్వరుడు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన అశ్వ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వుంచి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా చిత్తూరుకు చెందిన న్యాయవాది లోకనాథరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బుధవారం ఉదయం ఆలయం నందు తోపు ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా మొగిలీశ్వర దేవస్థానం వ్యవహరించింది.

## 11వ రోజు 23.02.2023 దేవరాత్రి

ఫాల్గుణ శుద్ద తదియ గురువారం మద్యాహ్నం 12గం.లకు వసంతోత్సవం

ఉదయం 9గం.లకు కేడిగ వాహనసేవ,

రాత్రి 9గం.లకు సింహాసనం-కామధేనువు వాహనసేవ

ధూర్జటికళాప్రాంగణంలో నేడు

ధ్వజావరోహణము

సా.4గం.నుండి :- యస్.వెన్నెల, శ్రీకాళహస్తి వారిచే భక్తిరంజని

సా.4.30గం.నుండి:- శ్రీలాస్య, అద్వైత, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన

సా.5గం.నుండి:-జి.ఆర్.హంసిక, ఐరాల వారిచే నృత్యప్రదర్శన

సా.5.30గం.నుండి:-కొట్టేగగన శ్రీహిత, హేశ్రిత, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన

సా.6గం.నుండి :-శ్రీశ్రీశ్రీ సంపూర్ణానందగిరి స్వామి ఉత్తరాధి పీఠాధిపతి శ్రీ శుకబ్రహ్మాశ్రమము వారిచే ప్రవచనము

రా.7గం.నుండి:-ఓ.మాలతీ, శ్రీకాళహస్తి వారిచే భక్తిసంగీత విభావరి

రా.8.30గం.నుండి:-ఐ.కన్నమ్మ, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన

రా.9.30గం.నుండి:-యస్.కావ్యాసింగ్, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన

రా.10.30గం.నుండి:-ఎ.మాధురి, తిరుపతి వారిచే నృత్యప్రదర్శ

రా.11గం.నుండి:- శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి, భీమవరం యస్.క్రిష్ణయ్య గారిచే సత్యహరిశ్చంద్రనాటకం.

# భరత నాట్యంలో షమ్రితకు నంది

## భరత నాట్యంలో షమ్రితకు నంది - శ్రీకృష్ణ దేవరాయల వారసురాలు లలితారాణి చేతుల మీదుగా అవార్డు

**గూడూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :**




గూడూరు తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన ఉడతా షమిత యాదవ్‌కు భరత నాట్య విభాగంలో శివనంది అవార్డు దక్కింది. కర్ణాటక రాష్ట్రంలో హోస్పేట (హంపి)లో ఫిబ్రవరి 18, 19, 20 తేదీలలో మహాశివరాత్రి సందర్భంగా సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ఫ్రైడ్ ఇండియా కల్చరల్ ఆధ్వర్యంలో జాతీయ నృత్య సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా గూడూరు సంస్కృతి సమ్మేళనం, శ్రీపొన్నలూరు వీరరాఘవరెడ్డి సంగీత, నృత్య పాఠశాల, శ్రీశివ లలిత భరతనాట్య కళాక్షేత్రం ప్రిన్సిపాల్ పిండి మల్లిక ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న షమితయ ఆదవ్‌కు శివనంది అవార్డును నిర్వాహకులు ప్రకటించారు. శ్రీకృష్ణ దేవరాయల వంశస్తురాలు లలిత రాణి చేతుల మీదుగా అవార్డు, ధ్రువీకరణపత్రం, మెడల్‌ను ప్రదానం చేశారు.

షమి త యాదవ్ ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాలలో జరిగిన రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి, కూచిపూడి, భరతనాట్యం పోటీల్లో పాల్గొని పలు అవార్డులు, రివార్డులను అందుకున్నారు. షమిత యాదవ్‌కు శివనంది దక్కడంపై పలువురు కళాభిమానులు తమ సంతో షాన్ని వ్యక్తం చేసి అభినందనలు తెలిపినట్లు తల్లిదండ్రులు తెలిపారు.